


మద్దతు ధర రైతులకు నష్టదాయకం

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
సోమవారం | 01 జూన్ , 2026 | పేజీలు : 04

# హైవే పచ్చదనానికి... పరిరక్షణ ఏది..?

మొక్కలు ఎండినా.. పట్టని పర్యవేక్షణ
హెడ్‌లైట్ల వెలుతురుతో.. పెరుగుతున్న ప్రమాద ముప్పు
హైవే అందం మసకబారుతోందా?

**ప్రజాపక్షం/నకిరేకల్:** జాతీయ రహదారులపై డివైడర్ల మధ్య పెంచే మొక్కలు కేవలం అందం కోసం మాత్రమే కాదు.. వాహనదారుల భద్రత, పర్యావరణ పరిరక్షణకు కూడా కీలకంగా ఉపయోగపడతాయి. ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ల వెలుతురు తీవ్రతను తగ్గించడం,వేగంగా వీచే గాలుల ప్రభావాన్ని నియంత్రించడం, కాలుష్యాన్ని తగ్గించడం హైవే అందాన్ని పెంచడంలో డివైడర్లలోని మొక్కలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్65) పరిధిలో కట్టంగూర్ నుంచి కేతేపల్లి వరకు డివైడర్ల మధ్య పెంచిన మొక్కలు సంరక్షణ లేక ఎండిపోవడం స్థానికులు, వాహనదారుల్లో ఆందోళన కలిగిస్తోంది.

**అగ్నికి ఆహుతైన హైవే పచ్చదనం**

గతంలో రహదారి నిర్వహణ చేపట్టిన సంస్థ డివైడర్లలోని మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, ట్రిమ్మింగ్ పనులు నిర్వహిస్తూ పచ్చదనాన్ని కాపాడేది. ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన గుత్తేదారు సంస్థ హయాంలో పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కట్టంగూర్‌కేతేపల్లి మధ్య అనేక ప్రాంతాల్లో మొక్కలు ఎండిపోగా, మొక్కల అడుగుభాగంలో గడ్డి పెరిగిపోయిందని స్థానికులు చెబుతున్నారు.

చెరువు అన్నారం స్టేజీ నుంచి సత్తిరెడ్డి కంపెనీ వరకు మార్గ మధ్యలో డివైడర్లలోని మొక్కలు, గడ్డి ఇటీవల అగ్నికి ఆహుతయ్యాయి. కిలోమీటర్ల మేర పచ్చదనం దగ్ధమై బూడిదగా మారింది. దీంతో హైవే అందం దెబ్బతినడమే కాకుండా, రాత్రి వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ల వెలుతురు నేరుగా పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**టోల్ వసూళ్లు సరే... నిర్వహణ ఏది.?**

హైవే నిర్వహణలో పలు లోపాలు ఉన్నాయనే ఆరోపణలు





వినిపిస్తున్నాయి. టోల్ ఫీజుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధ హైవే నిర్వహణపై కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. హైవే వెంట గ్రామాలకు ఏర్పాటు చేసిన లైట్లు సరిగా వెలగడం లేదని, పలు ప్రాంతాల్లో సూచిక బోర్డులు కనిపించడం లేదని చెబుతున్నారు. కొన్ని గ్రామాల వద్ద బస్‌స్టాప్‌ల కొరత కూడా ఉందని పేర్కొంటున్నారు.సర్వీస్ రోడ్ల శుభ్రత కరువు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ప్రమాద హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్, దారి సూచికలు మరింతగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. హైవే వెంట పరిశుభ్రత నిర్వహణలోనూ లోపాలు ఉన్నాయని విమర్శిస్తున్నారు.

**కొత్త మొక్కలు నాటాలి.. సంరక్షించాలి**

ఎండిపోయిన ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటి, డివైడర్లలోని చెట్లకు క్రమం తప్పకుండా నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు. అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. హైవే వెంట గ్రామాలకు లైటింగ్ సదుపాయాలు మెరుగు పరచడంతో పాటు, సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు, సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. హైవే డివైడర్ల పచ్చదనాన్ని కాపాడితేనే ప్రయాణ భద్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అభిప్రాయపడుతున్నారు.

**చెట్ల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం: మహేందర్ మేనేజర్**

హైవే డివైడర్లలోని మొక్కల సంరక్షణకు చర్యలు చేపడుతున్నామని రహదారి నిర్వహణ సంస్థ మేనేజర్ మహేందర్ తెలిపారు. సిబ్బందితో క్రమం తప్పకుండా నీరు పోయించడంతో పాటు, చెట్ల వద్ద పెరిగిన గడ్డిని తొలగిస్తున్నామని చెప్పారు. ఐటిపాముల పరిధిలో మంటలు ఎలా చెలరేగాయో తెలియదని, సమాచారం అందిన వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు వివరించారు.

**నిర్వహణపై దృష్టి పెట్టాలి: ఇటికల సురేందర్**

హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై టోల్ ఫీజుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధ హైవే నిర్వహణపై కూడా ఉండాలని ఇటికల సురేందర్ సూచించారు. చెట్ల పరిరక్షణ, పరిశుభ్రత,గ్రామాల వద్ద లైటింగ్,సూచిక బోర్డులు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ హైవే నిర్వహణను మరింత మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.

## ఇహెచ్‌ఎస్ కోతలు తక్షణమే నిలిపివేయాలి :ఎస్‌టియు టిఎస్

### విధివిధానాలు ఖరారు కాకముందే డిడక్షన్ సరికాదు

**ప్రజాపక్షం/నల్లగొండ** :ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం ప్రవేశపెడుతున్న నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు సంబంధించిన పూర్తి విధివిధానాలు ఇంకా ఖరారు కాకముందే ఉద్యోగుల మే నెల వేతనాల నుంచి 1.5 శాతం చందా మినహాయింపు చేపట్టడాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (ఎస్‌టియూ టిఎస్)నల్లగొండ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తందు భాను ప్రకాష్ గౌడ్,మురారిశెట్టి రమేష్ లు తీవ్రంగా ఖండించారు.ప్రభుత్వం ఏ ఉత్తర్వుల ప్రకారం డిడక్షన్ చేసిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులు,పెన్షనర్ల కుటుంబ సభ్యుల నమోదు ప్రక్రియ ఇంకా 50 శాతం కూడా పూర్తి కాలేదని తెలిపింది.ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో తరచూ మార్పులు జరుగుతుండటంతో అనేక మంది ఉద్యోగులు ఇంకా పూర్తి వివరాలు నమోదు చేయలేకపోయారని పేర్కొంది.కుటుంబ సభ్యుల అర్హత, భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైతే చందా మినహాయింపు విధానం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదని విమర్శించింది.ఆరోగ్య పథకం అమలుకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి,అన్ని సందేహాలకు సమాధానాలు ఇచ్చి, పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. అలా చేయకుండా ముందస్తుగా వేతనాల్లో కోతలు విధించడం ఉద్యోగుల్లో అసంతృప్తికి దారితీస్తోందని పేర్కొంది.రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని ఈహెచ్‌ఎస్ చందా పేరిట జరుగుతున్న వేతన కోతలను నిలిపివేసి, పూర్తి స్థాయి విధివిధానాలు ప్రకటించిన తర్వాత మాత్రమే అమలు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

## యుజిడి పనుల్లో నిర్లక్ష్యం

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆగ్రహం : సమగ్ర కార్యాచరణ ప్రణాళికకు ఆదేశం



వివరాలు మెయిన్‌లో



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998/99 పదవ తరగతి చదివిన విద్యార్థిని, విద్యార్థులుఉ ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనంద ఉత్సవాలతో సమ్మేళనాన్ని నిర్వహించారు. అలనాడు విద్యను బోధించిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సోమయ్య, కరుణాకర్, రవి, కాశీనాథం, నాగయ్య, జానయ్య, నాగరాజు, వెంకటేశ్వర్లు, తిరుపతయ్య పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ అధ్యక్షుడిగా లక్ష్మణ్



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్ నేరేడుచర్ల హరివిల్లు శాఖ అధ్యక్షులుగా పట్టణానికి చెందిన కొత్తా లక్ష్మణ్ నియమితులయ్యారు. ఆదివారం నేషనల్ ట్రెజరర్ నూనె సుదర్శన్, నేషనల్ సర్వీస్ డైరెక్టర్ కోట్ల సాయి కిరణ్, రీజియన్ ప్రెసిడెంట్ సరిత, కోట, నేషనల్ కోఆర్డినేటర్ వీరవెల్లి శ్రీలతల ఆధ్వర్యంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో తనూన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. కొత్తా లక్ష్మణ్ వాసవి క్లబ్‌లో చేసిన నిరంతర సేవా కార్యక్రమాలను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో ట్రైనర్‌గా శిక్షణ పొంది మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, యాంటి డ్రగ్స్ వాలంటీర్‌గా అనేక విద్యా సంస్థల్లో మోటివేషనల్ క్లాసులు నిర్వహించి విద్యార్థులను చైతన్యపర్చారు. ఆయనతో పాటు హరివిల్లు క్లబ్ రీజనల్ సర్వీస్ డైరెక్టర్ గా సరికొప్పుల నాగేశ్వరరావు, హరివిల్లు శాఖ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పొలిశెట్టి శ్రీధర్, కోశాధికారిగా పొలిశెట్టి వెంకటేశ్వర్లు లను నియమించారు. వీరి ఎంపిక పట్ల పట్టణ ప్రజలు, వాసవి వనితా క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## కల్యాణ మంటపానికి విరాళం

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయ కళ్యాణ మండప నిర్మాణానికి పల్లపు వెంకటేశ్వర్లు సావిత్రమ్మ జ్ఞాపకార్థం పల్లపు శాంతమ్మ మనవడు పల్లపు గోపాలరావు ప్రేమజ్యోతి దంపతులు 20,116 రూపాయలను విరాళంగా అందజేశారని దేవాలయ కమిటి అధ్యక్షులు భవిరిశెట్టి వెంకటరత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండ వెంకట సత్యనారాయణ, వందనపు సూర్యప్రకాశ్‌రావు, చెన్నూరు వెంకటేశ్వర్లు, వందనపు దయాకర్, దివ్వెల శ్రీనివాసరావు, బుస్సా మహేష్, గజ్జి అప్పారావు, వందనపు మోహన్‌రావు, బోనగిరి ఉపేందర్, కమిటి సభ్యులు పాల్గొన్నారు.



# రాజీవ్ యువ వికాసం ఎక్కడో?



**ప్రజాపక్షం/పాలకవీడు:** తెలంగాణ రాష్ట్రంలో యువతకు స్వయం ఉపాధి కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసి ఆర్భాటంగా రాజీవ్ యువ వికాసం పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి ఇంతవరకు ప్రకటించకపోవడం ఏమిటని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఆయన పాలకవీడు మండల కేంద్రంలో యువజన సమాఖ్య ముఖ్య నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఇదే మాదిరి ఇంటర్వ్యూలు నిర్వహించి సుమారు ఐదు లక్షల మంది యువకులకు ఆశచూపించి ఏ ఒక్కరికి ప్రభుత్వం తరుపు నుంచి రుణ సౌకర్యం కల్పించకుండా యువతను మోసం చేసిందని, సరిగ్గా ఈ ప్రభుత్వం కూడా అలాగే చేస్తుందని కొన్ని, కొన్ని విషయాల్లో బిఆర్ఎస్ పరిపాలన కాంగ్రెస్ పరిపాలనకు సారూప్యత దగ్గరగా ఉన్నదని ఉదహరణకు వితంతువులకు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ 30వ తేదీ వచ్చిన అతీగతిలేకుండాపోతుందని, అలాగే యువత విషయంలో రెండు ప్రభుత్వాలు ఒకే వైఖరి కలిగి ఉన్నారని వాగ్దానాలు చేసిప్రజలను ఏ మార్చడంలో కూడా రెండు ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వం కూడా ప్రజలను మోసగించినట్లుగానూ ఈ ప్రభుత్వం కూడా చదువుకునే ఆడపిల్లలకు ఉచితంగా స్కూటి ఇస్తామని వివాహిత మహిళలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం చేస్తామని నిరుద్యోగ బృతి ఇస్తామని, 57 సంవత్సరాలకే పెన్షన్ అందజేస్తామని ఆసరా పెన్షన్ రెట్టింపు చేస్తామని చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట పాలకవీడు మండల సిపిఐ కార్యదర్శి ముల్క జానయ్య, నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, బిసి హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తి.. సందీప్ వర్మ సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/పెన్‌పహడ్:** తండ్రి జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టి, వృద్ధులకు అండగా నిలిచిన పెన్‌పహడ్ మండల ఎన్ఎస్‌యుఐ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నాని సందీప్‌వర్మ సేవా నిరతిని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రత్యేకంగా ప్రశంసించారు. పిన్నాని సందీప్‌వర్మ తండ్రి పిన్నాని యల్లయ్య మూడవ వర్ధంతిని పురస్కరించుకుని దురాజ్‌పల్లిలోని వివేకానంద వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయాల్లో చురుగ్గా ఉంటునే సామాజిక బాధ్యతతో వృద్ధుల ఆకలి తీర్చడానికి ముందుకు వచ్చిన యువ నాయకుడు సందీప్ వర్మను అభినందించారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సజీవంగా ఉంచటం యువతకు ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. అనంతరం అశ్రమంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన చైర్మన్ వృద్ధులకు అవసరమైన మౌళిక సదుపాయల కల్పనకు తనవంతు పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు పిన్నాని సైదులు, పెద్దిపోలు సునీల్‌గౌడ్, అశ్రమ ట్రస్టు చైర్మన్ సవరాల సత్యనారాయణ పాల్గొన్నారు.



## ప్రజల దాహార్తిని తీర్చేందుకే సేవ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టమని శ్రీసత్య సాయి సేవ సమితి కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ అన్నారు.ఆదివారం హైదరాబాద్ రోడ్ లో గల తిరుమల థియేటర్ ఎదురుగా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో బాటసారుల, కార్మికుల ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 28 సంవత్సరాలుగా హైదరాబాదు రోడ్ లోని తిరుమల థియేటర్ ఎదురుగా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో బాటసారుల,కార్మికుల ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సంస్థకు ప్రతి సంవత్సరం సహకరిస్తున్న పల్లెర్ల యాదగిరి కుటుంబ సభ్యులను సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు.

## మహా అన్నప్రసాదం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మడల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.దేవస్థానం అర్చకులు ఉత్తరపల్లి అనంత చార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామివారికి మహా నైవేద్యం,మంగళహారతి అనంతరం కార్యాలయం నిర్మాణ దాతలు,ప్రారంభకులు గడగోజు యాదమ్మ శంకరయ్య దంపతులు అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తాడోజు జగదీష్ కుమార్,ధర్మపత్ని లావణ్య,రేపాల శివశంకర్, ధర్మపత్ని చైతన్య, శ్రీరామోజు నాగాచారి,భాస్కర్, సమత తదితరులు పాల్గొన్నారు.



## ప్రతీ పేదకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బ్రహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బండారి వెంకటేష్ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా సస్పెన్షన్‌కు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా కమిటి నిర్ణయం మేరకు బండారి వెంకటేష్ సస్పెన్షన్‌ను ఎత్తివేసినట్లు ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు ఇమ్మడి దశరథగుప్త తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి పేదకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలలు అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు.



## కార్ డ్రైవర్లకు కాంగ్రెస్ అండ

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కార్ డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో పటేల్ రమేష్‌రెడ్డి నివాసంలో ఇటీవల ప్రమాదంలో చనిపోయిన నవిల్ మహేష్ కుటుంబానికి డ్రైవర్‌ల యూనియన్ అందించిన లక్షా 40వేల రూపాయలు, టూరీజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పదివేలు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఫారూఖ్ ఐదువేలు, ముదిరెడ్డి వెంకటరమణారెడ్డి రెండువేలు మొత్తం లక్షా 57వేల రూపాయలను మృతుని కుటుంబానికి అందజేసి మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో డ్రైవర్లు అందరూ గ్రూప్ ఇన్స్‌రెన్స్‌లు కలిగి ఉంటే కుటుంబానికి భరోసాగా ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. రోడ్డుపై ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని డ్రైవర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫిఉల్లా, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, డిసిసి కార్యదర్శి నేరెళ్ల మధుగౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, ఫారూఖ్, కౌన్సిలర్ బైరబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తే ఎప్పటికి తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ అధికారి వడ్డే శ్యామ్ సుందర్‌రెడ్డి పదవి విరమణ వీడ్కోలు సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 32 సంవత్సరాలుగా గ్రంథాలయ అధికారిగా వృత్తిలో క్రమశిక్షణ పట్టుదల, సత్ ప్రవర్తన కలిగి అంకితభావంతో తమ వృత్తిని సజావుగా కొనసాగించారని తెలిపారు. సూర్యాపేట గ్రంథాలయంలో ఉద్యోగం చేస్తూ రాష్ట్ర ఉత్తమ గ్రంథాలయ అధికారి గ్రహిత అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలమ్మ, మనోజ్‌కుమార్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు వేణుగోపాలచార్యులు, శ్రావణ్‌కుమార్, రుకోదర్, సురేందర్‌రెడ్డి, నాగేశ్వరరావు, రంగారావు, కృష్ణారెడ్డి, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

## నామ బ్రదర్స్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఫిబ్రవరి 2, 2026 హైద్రాబాద్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆధ్వర్యంలో కీబోర్డు వాయిద్యం పోటీలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో 22 దేశాల నుండి రెండువేల మంది పాల్గొని కీబోర్డు వాయిద్యాకారుల గంటపాటు ఆగకుండా కీబోర్డు వాయిస్తూ పాల్గొన్నారు. అందులో కీబోర్డు వాయించడంలో 777 విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో మిర్యాలగూడెంకు చెందిన నామ జాషువ, వసంత కుమార్‌లు నామ క్లైమెంట్, నామ క్లేమ్మి అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఎంపికైన చిన్నారులను మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు ఆగస్టిన్ దండింగి, హైద్రాబాద్ విక్టోరియా ఆడిటోరియం, గచ్చిబౌలిలో గిన్నిస్ అచీవర్స్ మీట్‌లో సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు సన్నిహితులు, చిన్నారులను అభినందించారు.





## కార్యదర్శికి ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో పంచాయితీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ప్రభువర్ధన్‌రెడ్డిని పుల్లెంల గ్రామ సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముక్కాంల వెంకన్న యాదవ్ మాట్లాడుతూ పుల్లెంల గ్రామ పంచాయితీ కార్యదర్శిగా గత ఏడు సంవత్సరాల నుండి విధులు నిర్వహించి అందరిచే మన్ననలు పొందిన ఎపిఓ ప్రభువర్ధన్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య, ఏఈఓ పవన్ , వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## విద్యార్థికి సన్మానం




**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని శ్రీ సాయి ప్రశాంతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని మొలగూరి శ్రేష్ఠ 2026 పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 560 మార్కులు సాధించిన సందర్భంగా ఆదివారం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి కృష్ణ విద్యార్థిని, వారి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తోటకూరి స్వప్న ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ సేవలు చిరస్మరణీయమని వాసవీ గ్రేటర్ ఓల్డ్ టీం ప్రోగ్రాం ఛైర్మన్ ఐపీసీ మిర్యాల శత్రయ్య అన్నారు. ఆదివారం సినీ నటుడు కృష్ణ జయంతి సందర్భంగా వాసవీ గ్రేటర్ ఓల్డ్ టీం ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ డీఎం రామ్మోహన్ సహకారంతో ఆయన ఫ్రూట్ కటింగ్ చేసి 800 మంది పాదాచారులకు, ప్రయాణీకులకు, ఆర్టీసీ సిబ్బందికి పులిహోరా, పెరుగన్నం, మిర్చి, ఫ్రూట్స్, స్వీట్లుతోపాటు చల్లటి తాగునీటిని అందించారు. కార్యక్రమంలో జానకిరాంరెడ్డి, మిర్యాల లక్ష్మయ్య, మిర్యాల పద్మ, హారిక, గుండా మల్లయ్య, శ్రీను, కుశ కుమార్, శ్రీను, ఉపేందర్, వెంకన్న, శ్యాంసుందర్, ఆదినారాయణ, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

## రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేష్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 చెల్లించాలని లేనట్లయితే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో మల్లు గౌతంరెడ్డి, రామ్మూర్తి, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## టియుడబ్ల్యూజె జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/చిట్యాల:** ఈ నెల 3వ తేదీన నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జరగనున్న టియుడబ్ల్యూజె(ఐజెయు) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ళ బయ్యన్న వర్కింగ్ జర్నలిస్టులను కోరారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సుధీర్ఘంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు యూనియన్ కొలిక్కి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగా ప్రధానమైన ఇండ్ల స్థలాల సమస్య త్వరలోనే పరిష్కారం కానుందన్నారు. ఈ సంవత్సరం పెద్ద సంఖ్యలో అక్రిడియేషన్ల మంజూరుకు కృషి చేసిందన్నారు. జిల్లా మహాసభకు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డితో పాటు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, కె రామనారాయణ, ప్రభుత్వ చీఫ్ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తదితరులు హాజరు కానున్నారని, అధిక సంఖ్యలో జర్నలిస్టులు హాజరై సభను విజయవంతం చేయాలని బయ్యన్న కోరారు. ఈ సమావేశంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మెండె వెంకన్న, పోకల కరుణాకర్, నాయకులు మిర్యాల ప్రకాష్, సూరెపల్లి సూర్యానారాయణ, జిట్ట మల్లేష్, అమరోజు వెంకన్న, చికిలంమెట్ల మెహర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## వీరన్నస్వామి రైస్‌మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వీరన్న స్వామి రైస్‌మిల్లును ఆదివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పాలనలో రైతులు దినదిన అభివృద్ధి సాధించాలని,నూతన రైస్‌మిల్లు ఏర్పాటు చేసినందుకు వట్టికూటి రమేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రైస్ మిల్లు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. రైతుల అభివృద్ధికి ప్రజా పాలన ప్రభుత్వం చేయూతను అందిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రజాపాలన ముఖ్య ఉద్దేశ్యమని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అనంతరం సీనియర్ కాంగ్రెస్ నాయకులు తీగురి నర్సిరెడ్డిని పరమార్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేసగాని సరిత లక్ష్మణ్, రామాపురం సర్పంచ్ బుత్కూరి వెంకటరెడ్డి, వల్లపురెడ్డి సురేందర్‌రెడ్డి, పల్లా కళింగరెడ్డి, గుండు శ్రీనివాస్, మొక్క బిక్షపతి, పల్లా యుగందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బజ్జూరి అచ్చిరెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ వెంకటరమణకు ఘన వీడ్కోలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్థానిక కేఎన్ఎం డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో భౌతిక శాస్త్ర సహాయ అధ్యాపకులు, మాజీ ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ త్రాసు వెంకటరమణ పదవీ విరమణ సందర్భంగా ఆదివారం కళాశాల ఆవరణలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డిఎస్ఆర్.రాజేందర్ సింగ్, మాజీ జాయింట్ ప్రొఫెసర్ జి.యాదగిరిలు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. వెంకటరమణ అందించిన సుమారు 36 సంవత్సరాల సుదీర్ఘ విద్యా సేవలను, వివిధ బాధ్యతల్లో కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఉత్తమ గురువుగా ఆయన నిలిచారని ప్రశంసించారు. అనంతరం అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు కలిసి వెంకరమణను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ తనకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యా, సామాజిక సేవల్లో కొనసాగుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యతోనే అభివృద్ధి సాధ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యతోనే అభివృద్ధి సాధ్యమని విద్యోదయ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుప్పాల సత్యం అన్నారు. పాఠశాలలో 2010/2011 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోదాను, అంతస్థును అందించే విద్యను మించిన ఆస్తి మరొకటి లేదన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు సమాజంలోని ఉన్నత స్థానాలను అధిరోహించి, నలుగురికి సేవలందించే స్థాయిలో ఉండడం ఆనందంగా ఉందన్నారు. విద్యా వ్యాప్తికి తమవంతు కృషి చేయాలన్నారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, పున్నమ్మ, పుప్పాల యాదగిరి, కుందనపలికల బాలకృష్ణ, ముస్తఫా, ఆర్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, అమృతమ్మ, ప్రమీల, శశికళ, జ్యోతి, రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

## కంఠమహేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం

**ప్రజాపక్షం/నడిగూడెం:** కంఠమహేశ్వరుని దయ వల్ల గౌడకులస్తులందరూ ఐక్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వల్లాపురం గ్రామంలోని కంఠమహేశ్వరుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, గౌడ కులస్తులు పాల్గొన్నారు.



## 3న నకిరేకల్ సభకు జర్నలిస్టులు తరలిరావాలి

**ప్రజాపక్షం/తిప్పర్తి:** జూన్ 3న నకిరేకల్‌లో నిర్వహించనున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐజేయూ) జిల్లా మహాసభకు జర్నలిస్టులు పెద్దఎత్తున తరలిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు.ఆదివారం మండల కేంద్రంలో జరిగిన జర్నలిస్టుల రౌండ్ టేబ్ సమావేశానికి తిప్పర్తి మండల వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు బద్దం జానయ్యతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిర్విరామంగా పోరాడుతోందన్నారు.మహాసభకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ,ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ హాజరవుతారని తెలిపారు.ఈకార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పులిమామిడి మహేందర్ రెడ్డి,శ్రీనివాస్,పి.విజయ్ కుమార్,సిరవాడ గిరి,ఎండీ రషీద్,మమ్మద్ జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం రోజున ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్ లక్ష్మినర్సింహ్మారావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం అనేది చిన్ననాటి మధుర జ్ఞాపకాలను, స్నేహాన్ని మరొకసారి గుర్తు చేసుకునే అద్భుత వేదికని అన్నారు. మరొక విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుకుడాల గోవర్ధన్ మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు చొల్లేటి యోగేంధ్రనాథ్, చొల్లేటి పాండు రంగాచారి, వడ్డెగాని యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బెల్టులు ప్రదానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కరాటే మాస్టర్ రామకృష్ణ నేతృత్వంలో విద్యార్థులకు ఉచితంగా నిర్వహించిన కరాటే శిక్షణ శిబిరం ముగింపు వేడుకలకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరై విజేతలకు బెల్టులు, సర్టిఫికెట్లు అందించి మాట్లాడారు. ఆత్మరక్షణ విద్యలు నేర్చుకున్నప్పుడే విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పిల్లల నైపుణ్యాలను గుర్తించి వారిని క్రీడల వైపు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడా శిబిరాలకు తమ వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువకుడికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన నిరుపేద అయిన యువకుడు పులికంటి అనిల్ తనకు ఉపాధి చూపించాలని కోరుతూ ఆదివారం పిసిసి సభ్యులు, పిఏసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి వద్ద తన ఆవేదనను వినిపించడంతో వెంటనే స్పందించిన నర్సింహారెడ్డి యువకునికి తక్షణమే రూ. 50వేలు అందించి ఆటో కొనుగోలు చేసుకొని తన కాళ్ల మీద తాను నిలబడే విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేసి యుకుడిని ప్రోత్సహించారు.



## చిన్నారికి ఆశీర్వాదం

**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నేరేడుగొమ్ము మండల పరిధిలోని కాచరాజుపల్లి గ్రామానికి చెందిన గన్నెబోయిన రామాంజనేయులు అలివేలు కుమార్తె మోక్షశ్రీ నూతన పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యానాయక్ పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, గోవింద్, రాజు, శ్రీనయ్య, పెద్ద అంజయ్య పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నకిరేకల్** : విశ్రాంతి ఉద్యోగుల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో సామూహిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జల మోహనయ్య,చిక్కు రవీందర్,ఎస్.ఉత్తరమ్మ,సిహెచ్ లక్ష్మి ఏ భాస్కర్, కరుణాకర్ రెడ్డి, ఆర్. లింగయ్య, ఎస్.రాజయ్య,ఏ.బ్రహ్మాచారిలను సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కందాల పాపిరెడ్డి, కార్యదర్శి వీరమల్ల రవీందర్,కోశాధికారి చిక్కు రవి పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌ను విమర్శిస్తూ బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టడం సిగ్గుచేటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దాదాపు నాలుగు దశాబ్ధాలకు పైగా రాజకీయ అనుభవం కలిగిన బీసీ బిడ్డ, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను విమర్శిస్తూ ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడాన్ని బీసీ జేఏసీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ ఆదివారం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలో వస్తున్న ఐక్యతను చూసి కొంతమంది ఓర్వలేక బీసీ నాయకులను వ్యక్తిగతంగా విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రాజకీయ నాయకుల ఎదుగుదలను చూసి ఓర్వలేక పనిగట్టుకోని దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో కావాలనే పనిగట్టుకోని బీసీలను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌పై తప్పుడు ప్రచారం చేశారని అన్నారు.

## ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలంలోని లక్ష్మాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1998/ 99 ఏడవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాటమరాజు, బత్తిని ఆంజనేయులు, ముక్కాముల స్వామి యాదవ్, బొడిగె ఆంజనేయులు, చెరుకు మురళి, జె. కుమార్, వరలక్ష్మి, శోభ, లక్ష్మి, ధనమ్మ తదితరులు ఉన్నారు.



# తెలంగాణలో బిజెపి రావడం ఖాయం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రానున్న సార్వత్రిక ఎన్నికలలో అత్యధిక స్థానాల్లో గెలిచి తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బిజేపి తెలంగాణ రాష్ట్ర ఎన్నారై విభాగ కన్వీనర్ , మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్‌ని గాలికి వదిలేసి హైద్రాబాద్‌కి పరిమితమయ్యారని , దళారి వ్యవస్థను ఏర్పాటు చేసి అభివృద్ధిని అదమరిచారని విమర్శించారు. తాను హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్ప ఈ రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఇతర పార్టీల కార్యకర్తలు నాయకులపై అడ్డగోలుగా తప్పుడు కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న నాలుగున్నర ఏళ్లలో అనుక్షణం హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గ్రామాలు, తండాలు అభివృద్ధే ధ్యేయంగా కృషి చేయడం జరిగిందని, అన్ని వేళ్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయడం జరిగిందన్నారు. పట్టణ శివారులోని పణిగిరి శ్రీ సీతరామచంద్రస్వామి గుట్ట వద్ద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపిగా ఉన్న సమయంలో ఆయన ఆమోదంతోనే విలేకరులకు ఇచ్చినటువంటి పట్టాలు అధికారికంగా అధికారుల చేత ఇప్పించిన కూడా అవి తప్పుడు పట్టాలుగా ధృవీకరిస్తూ కొందరు అరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్యల వారదిగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించి వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షులు కొండ హరిష్ గౌడ్, మండల అధ్యక్షులు గంగసాని నారపురెడ్డి, మఠంపల్లి మండల అధ్యక్షులు బొమ్మనబోయిన వెంకటశివ, బిజేపి జిల్లా నాయకులు సోమగాని ప్రదీప్‌గౌడ్, బెల్లంకొండ నరేష్‌గౌడ్, గుండా గోపి, కొప్పెర సాయిరాం, రాళ్లబండి రామారావు, కంటు నాగరాజు, జాగదయ్య, హిందుజా, గుండా కోటేశ్వరరావు, ఆరాల సైదులు, ప్రమోద్ పాల్గొన్నారు.



# కుల గణనకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో కుల గణన చేపట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తోందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ ప్రశ్నించారు.కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ బీసీ కులాల సామాజిక,ఆర్థిక స్థితిగతుల్లో ఆశించిన మార్పు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేకపోతుల నరేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయ,విద్యా,ఆర్థిక రంగాల్లో తగిన ప్రాధాన్యం కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, వారి హక్కులను పరిరక్షించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం బకాయిలను సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.అలాగే జీవో నెం.7ను బేషరతుగా రద్దు చేయాలని,బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగితే తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సహించదని హెచ్చరించారు.ఈ సమావేశంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకరాజు సతీష్ కుమార్,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణంరాజు,రాష్ట్ర అధికార ప్రతినిధి నీలం వెంకట మధుచొల్లేటి రమేష్,కొత్త లింగస్వామి యాదవ్,కల్లూరు సత్యనారాయణ గౌడ్,వెంపటి నరసింహదొండ సాంబయ్య,ఉల్లెందుల అంజయ్య,డబ్బికార్ రాజా, కృష్ణ యాదవ్,కాస్పరాజ్ జానీ,మధు,గడ్డం మారయ్య, రేఖ్య నాయక్, రమేష్ పాల్గొన్నారు.

# మూడు నెలల పసికందుకు ప్రాణం పోసిన 108 నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎంసీహెచ్ పీఐసీయూ నుంచి తుమ్మడం గ్రామానికి చెందిన బేబీ ఆఫ్ శ్రీవర్షిణి మూడు నెలల ఆడ శిశువును నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది కాపాడారు.శిశువు ఫయిల్యూర్ టు థ్రైవ్,మెనింజైటిస్,హైపోక్సిక్ మూర్ఛలు,ఆస్పిరేషన్ న్యుమోనియా, శ్వాసకోశ వైఫల్యంతో బాధపడుతోంది.తదుపరి చికిత్స కోసం ట్రాకియోస్టోమీ అవసరమని వైద్యులు సూచించారు.మధ్యాహ్నం 12:45 గంటలకు 108కు కాల్ రాగానే నియోనేటల్ అంబులెన్స్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు.అంబు బ్యాగ్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ వెంటిలేటర్ సహాయంతో వైటల్స్ మానిటర్ చేస్తూ శిశువును తరలించారు.వెంటిలేటర్ సపోర్ట్ పీఎస్‌వీటీవీ మోడ్ ద్వారా ఆక్సిజన్ అందించారు.ఈఆర్‌సి డాక్టర్ సూచన మేరకు సిరంజి పంప్ సహాయంతో 6.2 ఎంఎల్/గంట చొప్పున అడ్రినలిన్ ఇచ్చారు.మార్గమధ్యంలో వైటల్స్‌ను జాగ్రత్తగా నార్మల్ చేస్తూ మానిటర్ ద్వారా పరిశీలిస్తూ శిశువును సురక్షితంగా హైదరాబాద్ నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.ప్రస్తుతం పాప ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.





## ఘనంగా మే డే వేడుకలు

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం సబ్ స్టేషన్‌లో మే డే వేడుకలను చౌటుప్పల్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఆలే రమేష్, గంగుల సోమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిధులుగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతినిత్యం కార్మికుల కోసమే తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం 11 0 4 ముందుండి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పలుగుల శ్రీధర్, యాదాద్రి జిల్లా యూనియన్ నాయకుడు తిరుమలేష్, చౌటుప్పల్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, సబ్ డివిజన్ లీడర్ నల్ల రాములు, రామన్నపేట సెక్షన్ లీడర్ చాంద్ పాషా, సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్, ఎం.యాదయ్య, కె.మహేష్ గౌడ్, కంచ యాదయ్య, రెడ్బస్ నవీన్, జింకల సైదులు, ఉట్కూరు సాయికుమార్ పాల్గొన్నారు.

## డోలారోహణ కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో ఆదివారం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల నవీన్ కుమార్ జ్యోతిల కుమారుడి డోలారోహణ మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ కార్యక్ర మంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్, రామన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి,రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు జమీరుద్దీన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్ రెడ్డి,నకిరేకల్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గార్లపాటి రవీందర్ రెడ్డి, నార్కట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తుల ఊషయ్య పాల్గొన్నారు.

## నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్లో ఆదివారం ఏర్పాటుచేసిన ఉద్యమకారుల ఫోరం ప్రతినిధుల సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీసీలు అధ్యక్షులు ఎస్కే చాంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ నిజమైన ఉద్యమకారులను గుర్తించాలి. రామన్నపేట మండల వ్యాప్తంగా ఉన్న నిజమైన ఉద్యమకారులను ఉద్యమకారుల ఫోరం తరపున గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీకి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు నోముల శంకర్, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇమామ్, రాష్ట్ర నాయకులు గడ్డం యాదగిరి, మండల నాయకులు కొండ మల్లేష్ పాల్గొన్నారు.

**ఉద్యమకారుల సమావేశానికి తరలివెళ్లిన నాయకులు**

హైదరాబాదులో బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రతినిధుల సమావేశానికి రామన్నపేట మండల తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర మైనార్టీల అధ్యక్షులు ఎస్కే చాంద్ ఆధ్వర్యంలో రామన్నపేట నుంచి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నోముల శంకర్, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి ఇమామ్, రాష్ట్ర నాయకులు గడ్డం యాదగిరి, నాయకులు కొండ మల్లేశం, కైరం కొండ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.